# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం 18 మార్చి, 2026 | పేజీలు : 08









## భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర భూ సర్వే చేయించుకోవాలి

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** భూములకు సంబందించిన వివాదాలు తగ్గించి రైతులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమంలో రైతులు తప్పని సరిగా పాల్గొని తమ భూములను రీ సర్వే చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. భూములకు సంబందించిన సమస్యలు సరిహద్దు వివాదాలు తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. మంగళవారం నాగలిగిద్ద మండలంలోని వల్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని భూములు రీసర్వేపై గ్రామ ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన 17 గ్రామాల్లో సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ ,అటవీశాఖ అధికారులు సమన్వయంతోఆధునిక రోవర్ సాంకేతికతను వినియోగించి వ్యవసాయ భూములు రీ సర్వే నిర్వహించి భూముల ఖచ్చితమైన తరువాయి 2లో...

## నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**ప్రజాపక్షం/పరకాల :** నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. జిల్లాలోని నడికూడ మండలంలోని కంఠత్మకూర్ గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు, రైతుల మధ్య వారధిగా నిలిచి నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు చేరవేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో జరుగుతున్న ఆధునిక మార్పులకు రైతులను సన్నద్ధం చేయాలని, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని అన్నారు. రైతులకు ఆధునిక పద్ధతులను అర్థమయ్యే విధంగా వివరించడంతో పాటు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించడం అభినందనీయమని తెలిపారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న, మిరప పంటల కోతలు కొనసాగుతున్న నేపథ్యంలో, మార్కెటింగ్ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు.తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు నేల ఆరోగ్యాన్ని కాపాడడం ముఖ్యమని పేర్కొన్నారు. ఎరువుల వినియోగంలో మితి పాటించాలని, సేంద్రీయ వ్యవసాయం, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. కూలీల కొరతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ యాంత్రికరణను అవలంబించాలని తెలిపారు. అలాగే వరి పంటలో అగ్గి తెగులు, గింజ మచ్చ తెగులు నివారణ, మొక్కజొన్నలో ఎండు తెగులు తరువాయి 2లో...



## పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలం తిప్పనగుల్ల గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్నా, ఇక్కడ మాత్రం మధ్యాహ్నం వేళ కూడా వీధి లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణ లోపంతోనే విద్యుత్ వృథా అవుతోందని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విద్యుత్ వృథాను అరికట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## మెరుగైన వైద్య సేవలు




ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

## విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాల బోధన




## నర్సంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ



## సమగ్ర భూ సర్వే చేయించుకోవాలి

(మొదటిపేజి తరువాయి)

హద్దులను నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత భూములపై ఉన్న అనేక వివాదాలు తగ్గి రైతులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. భూముల కొలతలు సరిగ్గా నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో భూరికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ భూములను రీసర్వే చేయించుకుంటే భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అసిస్టెంట్ డైరెక్టర్ అవినాష్ నాయక్, తహసీల్దార్ ఎంపిడిఓ సర్పంచ్ గ్రామ ప్రజలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

(మొదటిపేజి తరువాయి)

తట్టుకునే రకాల ఎంపిక, మిరప పంటలో కోత అనంతర నిర్వహణపై వివరించారు. విత్తన శుద్ధి ప్రాముఖ్యతను కూడా తెలియజేశారు.జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ మాట్లాడుతూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి అనసూయ ఉద్యాన శాఖ అందిస్తున్న రాయితీలు, ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలను వివరించారు.వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి. రవీంద్ర నాయక్ విద్యార్థులు నిర్వహించిన సదస్సును, ప్రదర్శించిన నమూనాలను అభినందించారు. గ్రామ సర్పంచ్ తిరుపతి, ఉప సర్పంచ్ కుమారస్వామి కార్యక్రమ నిర్వహణకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు తమ అనుభవాలను పంచుకోగా, రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్ శాస్త్రవేత్తలు, జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/ భీమదేవరపల్లి :** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ల బీసీ కాలనీ 12వ వార్డు నందు సిసి రోడ్ల నిర్మాణానికి ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి పంచాయతీరాజ్ ఏఈ వినయ్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి నిర్మాణాన్ని ప్రారంభించారు. 10 లక్షల నిధులతో ఎన్నారై జిఎస్ నిధుల నుండి సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు మాడుగుల కవితా గోపి పేర్కొన్నారు. ముందుగా తమ వార్డులో సిసి రోడ్ల నిర్మాణానికి సహకరించడం పట్ల సర్పంచికి కృతజ్ఞతలు తెలిపారు.



# నడికూడలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

**ప్రజాపక్షం/నడికూడ:** హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామ పంచాయితీని ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పూలమొక్కతో కలెక్టర్‌ను స్వాగతం పలికిన ఎంపీడీవో రామకృష్ణ, గ్రామ కార్యదర్శి శ్రీ భార్గవి,గ్రామ సర్పంచ్ కొంగంటి తిరుపతి. అనంతరం ట్యాక్సీ కలెక్షన్ గురించి కలెక్షన్ క్యాష్ లైందు ఉంటే ఎస్టిఓలో ఛాలన్స్ కట్టమని కంఠాత్మకూర్ గ్రామ కార్యదర్శి శ్రీ భార్గవికి కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. నడికూడ మండలం నర్సక్కపల్లె గ్రామాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అకస్మాత్తుగా సందర్శించి గ్రామ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. గ్రామంలో మిర్చి పంటను అత్యధికంగా పండించి ఆదర్శ రైతుగా నిలిచిన కోడెపాక దేవేందర్‌ని కలెక్టర్ అభినందించారు. వారి నూతన వ్యవసాయ పద్ధతులను ప్రశంసిస్తూ,



ఇతర రైతులకు కూడా ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ సందర్శనతో గ్రామ రైతులకు మరింత ప్రోత్సాహం లభించగా, ప్రభుత్వ సహకారంతో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ నారాయణ, తహసిల్దార్ రాణి, ఏపీవో విద్యావతి, అగ్రికల్చర్ అధికారులు, వార్డు మెంబర్లు, కరోబార్ మామిండ్ల రమేష్, నవీన్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాపన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావని నరేందర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. జిల్లా వైద్య స్క్రీనింగ్ శిబిరం సమగ్ర నివేదిక గురించి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య స్క్రీనింగ్ జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలు, సబ్ సెంటర్లలో ఈశిబిరాలు నిర్వహించామన్నారు. జిల్లాలోని 157 సబ్ సెంటర్లు, 19 పిహెచ్‌సిలలో స్క్రీనింగ్ కార్యక్రమం జరిగిందన్నారు. ఈ రక్త నమూనాలను టిహబ్ నమూనా రవాణా వ్యవస్థ ద్వారా టి డయాగ్నస్టిక్స్ ప్రయోగశాలలకు పంపడం జరుగుతుందన్నారు. అవసరమైన ఇతర ప్రయోగశాల పరీక్షలు స్క్రీనింగ్ సమయంలో గుర్తించిన అనుమానాస్పద కేసులను తదుపరి పరీక్షలు మరియు చికిత్స కోసం తగిన ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయడం జరిగిందన్నారు. ప్రజలకు మెరుగైన సమర్థవంతమైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. వైద్య స్క్రీనింగ్ శిబిరం ద్వారా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో హరిప్రసాద్, మెడికల్ ఆఫీసర్ అన్వర్, హరి ప్రసాద్, సిహెచ్ఓ చందర్, ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ.ఖలీం, వలం దేశీ శ్రీనివాస్, మెడికల్ సిబ్బంది మాధవి, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు

**ప్రజాపక్షం/ములుగు :** వైద్య శిబిరంలో వైద్య సేవలపై వచ్చిన, గర్భిణీ స్త్రీలు, శిశువులు, కిశోర బాలికలు, వృద్ధులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని, వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలను నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని రకాల మొక్కలను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామంలో మన ఊరు మన నర్సరీ వద్ద మొక్కలను పరిశీలించి రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న స్పెషలిస్ట్ వైద్య శిభిరాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తూరులో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి కాసిందేవిపేట గ్రామంలో పారిశుధ్య పనులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వైద్య శిభిరంలో వైద్య సేవలపై వచ్చిన, గర్భిణీ స్త్రీలు, శిశువులు, కిశోర బాలికలు, వృద్ధులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని, దానితో పాటు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను పోషక ఆహారాల ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించాలని స్పెషలిస్ట్ డాక్టర్లకు సూచించారు. రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గదులను, పరిసరాలను, హాజరు పట్టిక రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బంది సమయాపాలన పాటించాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అందుబాటులో లేని అత్యవసర మందులను సమకూర్చుకోవాలని ఆదేశించారు.

వైద్య సేవల కొరకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య శిభిరాలను ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ ఉచిత వైద్య సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రహీం, రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగ అన్వేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజమణి, సూపర్‌వైజర్స్ దేవమ్మ, నిర్మల మేరీ, ఫార్మసిస్ట్ స్టాఫ్ నర్సులు ఆరోగ్య కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బిటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలం, ఇంచెంచెర్వుపల్లి గ్రామంలో మంగళవారం బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్, గ్రామ ఉపసర్పంచ్ సరిత, విలేజ్ హెల్పింగ్ అండ్ ఫౌండర్ కామ అశోక్, గ్రామ పెద్దలు, యువత గ్రామస్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా విలేజ్ హెల్పింగ్ అండ్ ఫౌండర్ కామ అశోక్ మాట్లాడుతూ, రోడ్డు పనులు ఇప్పటికే చాలా కాలంగా ఆలస్యమవడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. గ్రామస్తులంతా ఒకే స్వరంతో, రోడ్డు నిర్మాణంలో తక్కువ నాణ్యత గల పదార్థాలు ఉపయోగించకుండా, సరైన మందం (థిక్నెస్), బలమైన బేస్,



ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రోడ్డు పనులు పూర్తి కావడంలో సహకరించిన పంచాయతీరాజ్ శాఖ శ్రీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్క జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాల బోధన

**ప్రజాపక్షం/దామెర :** హనుమకొండ జిల్లాలోని దామెర క్రాస్ రోడ్డులో ఉన్న ఆశ్రమ బాలుర హై స్కూల్ (ఆరేపల్లి)ను మంగళవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, పరిసరాలు, స్టోర్ రూమ్, కిచెన్ షెడ్‌లను పరిశీలించి, నిర్వహణపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పాఠ్యాంశం బోధన జరుగుతుండగా, కలెక్టర్ తరగతిలో పాల్గొని బోధనను పరిశీలించారు. ఆంగ్లంలో బోధించిన పాఠ్యాంశం విద్యార్థులకు అర్థమైందా అని ప్రశ్నించి, వారి అవగాహనను పరీక్షించారు. అలాగే 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షల సన్నద్ధతపై తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సమగ్రంగా సిద్ధమై, 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని తెలిపారు. పాఠశాలలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమకళ, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీ దేవి, ఎంఈఓ రాజేష్ పాల్గొన్నారు.

## నర్సంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/నర్సంపేట:** ప్రజా పాలనపట్టణ ప్రగతి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్ కార్యాలయంలో నిర్వహణలో ఉన్న రికార్డులు, కార్యాలయ పరిసరాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై కలెక్టర్ సమీక్షించారు. రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. అదేవిధంగా 99 రోజుల కార్యక్రమం అమలు తీరును పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలను వేగవంతంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ప్రజల వినతులను ఆలస్యం చేయకుండా పరిష్కరించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

రూ.5లక్షల విద్యా భరోసా కార్డు ఇంకెన్నడిస్తారు

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/నర్సంపేట :** శాసనసభ ఎన్నికల సమయంలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. రూ.3 లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం గల బిసి కుటుంబాల విద్యార్థులకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇస్తామన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. ప్రస్తుతం ఇవ్వాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.7500 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి ఐదు లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని చేసిన వాగ్దానం రెండేళ్లు దాటిన అమలు చేయరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులకు రూ. ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు ఇవ్వాలని అందుకు అవసరమైన మేరకు ఈ నెల 20వ తేదీన ప్రవేశపెట్టి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, విద్యార్థులకు చేసిన వాగ్దానాలన్నింటిని అమలుపరిచేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో విద్యార్థుల, బిసి సంఘాల ఐక్య ఉద్యమాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో హృదయాన్ని తాకే సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జటంగి బిక్షపతి అనారోగ్యంతో మృతి చెందగా ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా కుమారులు లేని నేపథ్యంలో పెద్ద కూతురు భద్రమ్మ తండ్రి అంత్యక్రియలను స్వయంగా నిర్వహించింది.

## హామీలు నెరవేర్చాలి



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మండల బీజేపి అధ్యక్షుడు బస్వ భాస్కర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. పేరుకుపోయిన ప్రతి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, అన్వేష్, అనిల్, మహేందర్, సుధాకర్, దుర్గరాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెడికల్ క్యాంప్



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని కోలుకొండలో మంగళవారం మల్లారెడ్డి నారాయణ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపులో ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. మోకాళ్లనొప్పులు, నడుము నొప్పులు, జ్వరం, దమ్ము, నడుము నొప్పి, ఇతర సమస్యల వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని ఎంపిక చేసి ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా చేస్తారని డాక్టర్ల క్యాంప్ బృందం వారు తెలిపారు. గ్రామ సర్పంచ్ కోతి స్రవంతి, ప్రవీణ్, ఉప సర్పంచ్ జయమ్మ, వార్డు సభ్యులు నరసింహులు, స్వరూప, శ్రవణ్, షాబుద్దీన్, బీరప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విఫలం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిస్తూ మండల బీజేపి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. బీజేపి రాష్ట్ర పిలుపుమేరకు మండల అధ్యక్షుడు బంగారు మహేష్ నేతృత్వంలో స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తమ్మడపల్లి సర్పంచ్ బేజాడి సిద్దులు, మన్‌సాన్ పల్లి సర్పంచ్ సందీప్, మండల బీజేపి ప్రధాన కార్యదర్శి రాజు, గణేష్ పాల్గొన్నారు.

# పురుగుమందుల వాడకంపై అవగాహన ర్యాలీ



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** భీమదేవరపల్లిలోని గ్రామ రైతులకు డబ్ల్యుడబ్ల్యు. ఎఫ్ నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వారి బిసిఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు అవగాహన సదస్సు, ర్యాలీ ఏర్పాటు చేయడం జరిగింది. రైతులు పంట పరిశీలన చేస్తూ ఆర్థిక నష్ట పరిమితి స్థాయి దాటితేనే పురుగుమందులు పిచికారి చేయాలని,అలాగే పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు తప్పక రక్షణ దుస్తులు(పిపిఈ) ధరించాలని, అనగా ముఖానికి మాస్క్, తలకి హెల్మెట్, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు, కళ్ళకి అద్దాలు, చేతులకు గ్లౌజులు, కాళ్ళకి బూట్లు వేసుకొని స్ప్రే చేయాలని, అలాగే ఎరుపు రంగు గుర్తు కలిగిన టువంటి మోనో, ఇతర మందులు వాడరాదని, అలాగే పర్యావరణానికి హాని కలిగించే పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, కషాయాలు వాడాలని ,పురుగు మందులు కొట్టేటప్పుడు రెండు, మూడు రకాల పురుగు మందులు కలిపి కొట్టరాదని, మార్కెట్లో రిజిస్టర్ చేయబడిన పురుగు మందులను కాంబినేషన్ రూపంలో ఉన్న పెస్టిసైడ్స్ వాడాలని, రైతులు, రైతు కూలీలకు కనీస వేతన చట్ట ప్రకారం కూలీ డబ్బులు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పైన చెప్పిన విషయాలను తప్పక ఆచరిస్తూ తమ ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణను కాపాడాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిసిఐ సమన్వయకర్తలు సాయికిరణ్, తిరుపతి, రజిత సోనీ, ఉపసర్పంచి వార్డ్ మెంబర్స్, రైతులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా రేణుక ఎల్లమ్మ బోనాలు



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** భక్తిశ్రద్ధలతో కోరి కొలిచే భక్తులకు కొంగు బంగారమైన రేణుక ఎల్లమ్మ దేవతకు మహిళలు బోనాల మొక్కులు చెల్లించుకుని మనసారా వేడుకుంటున్నారు. మంగళవారం ఆత్మకూరు మండలం నీరుకుల్లా గ్రామంలో కంఠమహేశ్వర స్వామి, రేణుక ఎల్లమ్మ దేవత ఉత్సవాలలో రెండవ రోజు ప్రతి ఇంటి ఇంటి నుంచి మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాసంతో బోనాలు తయారు చేసుకుని పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ, కుడుక, పోక ఖర్జూర పండ్లు, బెల్లం శాఖ పట్టుకొని కుటుంబ సమేతంగా డబ్బు వాయిద్యాలు, మేళ తాళాలు, పంబాల వారి డమరుక వాయిద్యాలతో, శివసత్తుల పూనకాలతో, రేణుక ఎల్లమ్మ, కంఠ మహేశ్వరుని గుడికి పిల్ల పాపలతో గౌడ కులస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో బయలుదేరారు. గ్రామం నుంచి దేవాలయం వరకు దారి పొడుగునా కొబ్బరికాయలు కొడుతూ బోనాలకు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్నారు. రాత్రి వరకు దేవాలయం చేరుకొని విశేష పూజలను పంబాల పూజారులు నిర్వహించి రేణుక ఎల్లమ్మ దేవతకు మొక్కులు మహిళలు చెల్లించుకుంటారు. భక్తులు చల్లంగా చూడాలని తల్లి రేణుక ఎల్లమ్మ అనుగ్రహం కలగాలని భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో విశేష పూజలను నిర్వహించారు. సాయంత్రం నుండి తెల్లవారుజాము వరకు నిర్వహించే పూజలో పాల్గొని భక్తులు తన్మయం చెందినారు. అమ్మ ఆశీస్సులు ఉంటే విజయం మాదేనని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఉత్సవాలకు నీరుకుల్లా గ్రామానికి చెందిన భక్తులే కాకుండా మండలం జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తున్నారు. నీరుకుల్లా పెంచికల్పేట గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని దేవుని దర్శించుకుంటున్నారు.

# ఎన్‌సిసి విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట మండలం లక్నేపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్ (సీబీఎస్ఈ)లో 2026–27 విద్యా సంవత్సరానికి ఎన్‌సిసి విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో 319 మంది విద్యార్థులు పాల్గొనగా 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇట్టి కార్యక్రమానికి హవల్దార్ కమలాకర్, నిషాద్ ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ ఎం.డి రియాజుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరుగు పందెం ,లాంగ్ జంప్ మొదలైన శారీరక, మానసిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్‌సిసి అనేది భారత సాయుధ దళాల యొక్క యువ విభాగమని, ఇది పాఠశాల, కళాశాల విద్యార్థులకు క్రమశిక్షణ ,నాయకత్వం, దేశభక్తిని నేర్పే స్వచ్ఛంద సంస్థ అని గుర్తు చేశారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్స్‌తో కూడిన ఎన్‌సిసి ట్రై సర్వీసెస్ శిక్షణ ద్వారా విద్యార్థులను దేశ పౌరులుగా తీర్చిదిద్దుతుందన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఎ.బి,సి సర్టిఫికెట్లు అందజేస్తారని, ఈ సర్టిఫికెట్లు ఉద్యోగ నియామకాలలో అదనపు పాయింట్లు చేర్చి రాత పరీక్షలో మినహాయింపు ఇస్తారన్నారు.

# సభకు తరలిన ఎంసిపిఐ(యు) కార్యకర్తలు

### జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించిన జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

**ప్రజాపక్షం/నర్సంపేట :** చట్టసభల్లో ఓంకార్ పాత్ర అనే అంశంపై మంగళవారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరగనున్న సభకు నర్సంపేట నుండి ఎంసిపిఐ(యు) కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ వాహన ర్యాలీని పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో నీతి నిజాయితీ విలువలను పెంపొందించడానికి అసెంబ్లీ టైగర్ ఓంకార్ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించే లక్ష్యంతో వారి శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా చట్టసభల్లో ఓంకార్ పాత్ర అనే అంశంపై రవీంద్రభారతి ఆడిటోరియంలో సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓంకార్ స్ఫూర్తితో నీతివంతమైన రాజకీయాల కోసం మార్క్సిజాన్ని, లెనినిజాన్ని పుణికిపుచ్చుకొని వర్గ సామాజిక ఉద్యమాలను ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ వంగాల రాగసుధ, కుసుంబ బాపూరావు, నాగెల్లి కొమురయ్య, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు సంగతి మల్లికార్జున్, ఎల్ల బోయిన రాజు, ఎండి మాషూక్, డివిజన్ నాయకులు అనుమాల రమేష్, బుడిమే సురేందర్ , ఎండి హుస్సేన్, పకిడే చంద్రరావు, ఘటికే కోటేశ్వర్, గణిపాక బిందు ,రాకేష్, మార్త నాగరాజు ,సుధా ,విజయ, సిహెచ్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన బొంత కనకయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బియ్యం, నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పురుషోత్తం, సోమేశ్వర్, కేశవరావు, మల్లేష్, మదార్, రాజు, వెంకటేశ్వర్లు, మహేందర్ పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజులలో ఇచ్చిన హామీలను అమలుపరుస్తామని హామీ ఇచ్చారని వటిని అమలు చేయలేదని వారన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపి మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు సంపత్, శ్రీకాంత్, ఉపేందర్‌రెడ్డి, రామారావు, మహేష్, అమరేందర్, కృపాకర్, శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, బోర్డ్ కార్యాలయం, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త నర్సింహా, టీజీపీసీబీ ఆదేశానుసారం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని ఏకశిల బీఈడీ కళాశాలలో ప్లాస్టిక్ కాలుష్యం వలన కలిగే ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడంపై నిషేధం, కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజల పాత్ర, పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, విద్యార్థులు క్రియాశీల పాత్ర పోషించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మారెడ్డి, లెక్చరర్లు శోభ, మురళి మోహన్, రత్నాకర్ రెడ్డి, ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గొర్రెల, మేకల పెంపకందారులకు జీవనోపాధి కల్పించాలి



**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** గొర్రెల మేకల పెంపకం దారులకు జీవనోపాధి కల్పించాలని స్టేషన్‌ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య అన్నారు. మంగళవారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నివాసంలో ఐలయ్యను మంచాల ఎల్లయ్య మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొర్రెల మేకల పెంపకం దారుల సమస్యలను అసెంబ్లీ సమావేశాలలో యాదవ కులస్థుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ, మండల నాయకులు, యాదవులు పాల్గొన్నారు.



# ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

### హనుమకొండ కలెక్టరేట్ ఆశాల ఎదుట మహాధర్నా



**ప్రజాపక్షం/హనుమకొండ :** ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశాలకు ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆశా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రాగుల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మూడు గంటల పాటు మహాధర్నా నిర్వహించారు. మహా ధర్నాకు ముందు ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియం నుండి భారీ ర్యాలీతో కలెక్టరేట్ కు చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలి, ఆశాల ఐక్యత వర్ధిల్లాలి, సిఐటియు జిందాబాద్, బకాయి పారితోషకాలు చెల్లించాలంటూ, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గేటును తోసుకుంటూ లోపలికి వెళ్లాలని ప్రయత్నించిన ఆశలను సుబేదార్ పోలీసులు అడ్డుకోవడంతో గేటు ముందు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహా ధర్నాకు హాజరైన సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇస్తామని, పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న హామీలను అమలు చేయడం లేదని తక్షణమే ఫిక్స్ వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పనికి తగ్గ పారితోషికాలను ఇచ్చేదానిలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని రెండు నెలలు గడుస్తున్నా కూడా వేతనాలు ఇవ్వలేదని, బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఆశాలు ఒకవైపున పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పోలీసు నిర్బంధం ద్వారా అక్రమంగా అరెస్టులు చేయడం సరైంది కాదని రమేష్ అన్నారు.ప్రజా ప్రభుత్వం అని చెబుతున్న ముఖ్యమంత్రి ప్రజా పాలనలో ధర్నాలు, ఆందోళనలు, పోరాటాలు చేయకుండా నిర్బంధాన్ని ప్రయోగించడం ఏ విధంగా సరైందని రమేష్ ప్రశ్నించారు.సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ, మార్చి 20వ తేదీన మంత్రి కొండా సురేఖ ఇంటి ముందు ధర్నా, మార్చి 28వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆశలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి యాకూబీ, బైరి శోభ, సిహెచ్ శ్రీవాణి, కే కల్పన, జనగాం శ్వేత, రమాదేవి, కవిత, పుతిలి, కరుణలత, పద్మ,ఇ శోభ, సంధ్య, నవమణి, లతోపాటు ఆశాలు పాల్గొన్నారు.

## రైతులకు ఫార్మర్ కిట్స్ పంపిణీ

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని సోడశపల్లి గ్రామంలోని రైతువేదికలో మల్లికుదుర్ల,కుమరిగూడెం గ్రామాలలోని 125 మంది రైతులకు జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం ,ప్రకృతి సిద్దాంతంగా లభ్యమయ్యే వనరులతో ప్రకృతి వ్యవసాయం గూర్చి అవగాహన కల్పించి రైతులకు ఫార్మర్ కిట్స్ పంపిణీ చేశారు .కార్యక్రమంలో గ్రామసర్పంచ్ జక్కుల మౌనికసంపత్ యాదవ్, మండలవ్యవసాయశాఖ అధికారి కవిత, ఎఇఒ శిల్ప, సిఆర్‌పిలు రేఖ, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో రుద్ర హోమం

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** విశ్వా వసు నామ సంవత్సర ఆఖరి మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం హనుమకొండ సాయిబాబా మందిరంలో రుద్ర హోమం ఘనంగా నిర్వహించారు పూజారులు కిషోర్ శర్మ శాస్త్రోక్తంగా ఈ హోమాన్ని నిర్వహించగా మణిశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం :** రైతు వేదిక ఆవరణలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్)లో భాగంగా మంగళవారం సర్వాయి, భూపతిపురం రైతులకు ఒక్కరోజు ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయం గురించి దృశ్య, శ్రవణ, మాధ్యమం, ద్వారా రైతులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. అంతేకాకుండా కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు ప్రకృతి వ్యవసాయం కిట్‌ను మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కళ్యాణి సిఆర్పి కమల, సౌజన్య, కన్నాయిగూడెం, చిట్యాల, భూపతిపూర్, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత అభివృద్ధితోనే జీవననాణ్యత మెరుగుపడుతుంది



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వ్యక్తిగత అభివృద్ధితోనే జీవననాణ్యతను మెరుగుపరుచుకోవచ్చునని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత డాక్టర్ ఎం.డి రాజమహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వరంగల్ హంటర్ రోడ్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో మంగళవారం వ్యక్తిత్వవికాసం మరియు నాయకత్వ లక్షణాలు అనే అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎం.డి రాజ్ మహ్మద్ పాల్గొని వ్యక్తిత్వవికాసం, నాయకత్వ లక్షణాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం అనేది కుటుంబనేపథ్యం నుండి రావాలని అన్నారు.వ్యక్తిత్వవికాసం మానసికంగా, వృత్తిపరంగా ఎదగడానికి సహాయపడుతుందని చెప్పారు. వ్యక్తిత్వవికాసం ద్వారా ప్రేరణ, సృజనాత్మకత, ఉత్సహాన్ని పొందవచ్చునని తెలిపారు. పీఠాధిపతి డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో పరిస్థితులను విశ్లేషించి తెలివైన, నమ్మకమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్ లో రాణించవచ్చునని అన్నారు. అనంతరం రాజ్ మహ్మద్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసాని సురేష్, డాక్టర్ చూరేపల్లి రవి కుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, బుక్కేరర్ సిద్దోజు సునంద, గెస్ట్ లెక్చరర్ డాక్టర్ నోముల రాజు, సిబ్బంది అంజనేయులు, అశోక్, సులోచన, కస్తూరిబాయి, పరిశోధకులు సోనబోయిన సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## టెండర్ విధానంతో ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్ట కొట్టొద్దు

### రోడ్డున పడనున్న చేనేత కార్మికులు

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి చేయూతనియాల్సింది పోయి వారి పొట్ట కొట్టే విధంగా టెండర్ విధానాన్ని అమలు చేయడానికి సిద్ధమవడం సిగ్గుచేటని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం వ్యాఖ్యానించారు. హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బచ్చు ఆనందం ప్రభుత్వం పై మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చాక చేనేత రంగం చిన్న పోయిందని, చేనేత రంగ అభివృద్ధికి పాటు పడాల్సిన ప్రభుత్వమే టెండర్ల పేరిట ప్రైవేటు పరం చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వాలు చేనేత కార్మికుల తయారుచేసిన వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధిని అందించేవారని, కానీ రేవంత్ సర్కారు టెండర్ల పేరిట చేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలను కొనుగోలు చేయడాన్ని విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని వీరాధిమంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడే అవకాశం ఉంటుందని, కార్మికుల పక్షాన టెండర్ విధానం రద్దు పరిచే వరకు ఉద్యమిస్తామని, కార్మికులతో కలిసి రోడ్డు ఎక్కుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశంలో అన్నం పెట్టే రైతన్న ఎలాగో, మానవుని మానప్రాణాలు కాపాడే నేతన్న కూడా అలాగే అని అలాంటి రంగంపై చిన్నచూపు చూడవద్దని, కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకొని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. అలాగే పద్మశాలీలకు, చేనేత కార్మికులకు వ్యక్తిగత రుణాలు అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్,జిల్లా ప్రధాన కార్యదర్శి కేదాశి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు నల్ల సత్యనారాయణ,బొప్ప శివశంకర్,పులికంటి రాజేందర్,గుర్రపు కోటేశ్వర్, దేవులపల్లి సదానందం, బింగి సతీష్, గుర్రపు చంద్రశేఖర్, పాము వెంకటేశ్వర్లు, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 19న జరిగే వేడుకలను విజయవంతం చేయాలని ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు కొలుగూరి సంజీవరావు, ఎర్రం సతీష్ కుమార్, కాశెట్టి శ్రీనివాస్‌లు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, శ్రీ వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా ప్రతి ఏటా ఉగాది పురస్కారాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ ఇల్లందు క్లబ్‌లో జరిగే వేడుకలలో వేద పండితులచే పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు హాజరవుతున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని కవులు కళాకారులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు గుజ్జ సారేశ్వర్ రావు, ములకల లక్ష్మారెడ్డి, మంద జోవర్ధన్, ఆకుతోట ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

## ముస్లింలకు తోఫా పంపిణీ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు సిపిఐ కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా (లాల్చీ క్లాత్, చుడీదార్ క్లాత్, పట్టు చీర, బట్టలను ముస్లిం సోదరులకు బట్టల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు ఇఫ్తార్ విందులు, మజీద్ రిపేర్ల కొరకు నిధులు, ఈద్గా కబ్రిస్తాన్లకు నిధులు, ఇమామ్ మోజల్లకు గౌరవ వేతనాలు, అనేకమైన కార్యక్రమాలు అమలు చేస్తుందని ఈ సందర్భంగా 24వ వార్డు సిపిఐ కౌన్సిలర్ వేముల జ్యోతిశ్రీకాంత్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ ఇర్ఫాన్, 24వ వార్డు అధ్యక్షులు కేవీ అశోక్ గౌడ్, మైనార్టీ నాయకులు మజీద్ కమిటీ ఉపాధ్యక్షులు అబ్దుల్ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధం వద్దు శాంతి ముద్దు

### నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** యుద్ధం వద్దు శాంతి ముద్దు అని, సిపిఐ మండల కార్యదర్శి రావుల సదానందం, ఆయన అన్నారు. మండలంలోని నెల్లుట్ల గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, సిపిఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రావుల సదానందం మాట్లాడుతూ, ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని, ఆ యుద్ధం వలన, పెరుగుతున్న గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువులపై ఒత్తిడి పెరిగి, సామాన్య ప్రజలపై భారం పడుతుందని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీశైలం, కాసర్ల శీను, చీటూరి రవి, మొటిక శీను, చీటూరి ఎల్లయ్య, కాసర్ల సత్తయ్య, వెంకన్న, మల్లయ్య పాల్గొన్నారు.

## జిపి కార్మికుల అక్రమ అరెస్టులను ఖండించండి

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** గ్రామపంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీతాలు పెంపదల చేయాలని అందుకోసం తగిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమంకు వెళుతున్న గ్రామపంచాయతీ కార్మికులను ముందస్తుగా అర్ధరాత్రి నుండి అరెస్టులు చేసి కమలాపూర్, అయినవోలు, పరకాల, ఆత్మకూర్ స్టేషన్ లలో పెట్టడం సిగ్గుచేటని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బొట్ల చక్రపాణి ఒక ప్రకటన లో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతోపాటు 7వ గ్యారెంటీ ప్రజాస్వామ్యం, నిరసన తెలియజేసే హక్కు ఉంటుందని చెప్పిన రేవంత్ ప్రభుత్వం ఈరోజు ఇందిర పార్క్ దగ్గర ధర్నాకు వెళ్తా ఉంటే ధర్నా చేయనీయకుండా అరెస్టులు చేయడం అనేది అత్యంత హేయమైన చర్య అని అభివర్ణించారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్యం, ఇతర పనులు చేస్తున్నటువంటి కార్మికులకు కనీస వేతనల్లేకుండా మల్టీ పర్పస్ పేరుతోటి ప్రాణాలు కోల్పోతా ఉంటే ప్రభుత్వానికి కనబడడం లేదా అని ప్రశ్నించారు.

## ఈదురు గాలులతో మామిడి రైతుకు నష్టం

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** సోమవారం సాయంత్రం వచ్చిన ఈదురు గాలుల వల్ల రైతులు తీవ్రంగ నష్టపోయారు ముస్తఫాపూర్ గ్రామ శివారు లో ఉన్న మామిడి రైతు గొర్రె బాబు మామిడి తోట లో మామిడికాయలు సోమవారం నాడు వచ్చిన ఈదురు గాలి వల్ల చెట్టు మండల విరిగి కుదుపుకు లోనై రాలి నేలమట్టం అయ్యాయి. దానివల్ల తీవ్ర నష్టం జరిగింది అని రాలిన కాయలను చూపిస్తూ రైతు ఆవేదన చెందుతున్నారు. కావున ప్రభుత్వం ఆదుకోవాలని ఎదురుచూస్తున్నారు.

## ప్రభుత్వం హామీలను అమలు చేయాలని వినతి

**ప్రజాపక్షం/నెక్కొండ:**మండల రెవెన్యూ అధికారికి బిజెపి నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా వంటి పథకాలు పూర్తిగా అమలు కావడం లేదని వారు ఆరోపించారు. ముఖ్యంగా రైతుల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందక అప్పులపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొన్నారు. అలాగే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని, అర్హులైన లబ్ధిదారులకు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామచర్ల రామారావు, శ్రీరంగం సంపత్, రాంపల్లి రాజగోపాల్, అంబాల రామ్‌గోపాల్, పింగిలి రాం మోహన్‌రెడ్డి, జమ్ముల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేన్ నాయక్‌కు పితృవియోగం

**ప్రజాపక్షం/గూడూరు :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికీ చెందిన జాతీయ ఎస్టీ కమిషన్ కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి జాటోత్ లచ్చనాయక్ మంగళవారం కన్నుమూశారు.ఈవార్తతో గూడూరు ప్రాంతంలోని విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని సందర్శించిన పలువురు రాజకీయ నాయకలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఎడ్ల అశోక్‌రెడ్డి కట్ల సుధాకర్‌రెడ్డి కీర్తిరెడ్డి రాణా ప్రతాప్‌రెడ్డి సంపత్ సంతోష్‌రెడ్డి తిరుపతిరెడ్డి బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి వేం వెంటకృష్ణారెడ్డి కత్తి స్వామి నూనవత్ రమేష్ నాయక్ కోమ్మాలునాయక్ దర్మరెడ్డి పెద్దపల్లి డిసిపి రాంరెడ్డి డిఎస్ రవిచంద్ర (ఐజేయు) మనుకోట జిల్లా అధ్యక్షుడు సిహెచ్ శ్రీనువాస్ మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి రమేష్ వేణు గూడూరు మండల జర్నలిస్టులు నాయకలు సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ ఆవుల యుగేందర్ మాదవ్ వీరన్న తదితరులు హాజరై తమ సానుభూతిని తెలిపారు. జాటోత్ అచ్చనాయక్ మరణం వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాలి



**ప్రజాపక్షం/నర్సంపేట :** ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, బడ్జెట్లో రూ.10వేల కోట్లు కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. నర్సంపేట బిసి సంక్షేమ సంఘం మండల కార్యదర్శి నూనె రంజిత్ కుమార్, పట్టణ కార్యదర్శి శీరంశెట్టి రాజేందర్ ల ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ర్యాలీ నిర్వహించి, ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్లో ఫీజు రియంబర్స్మెంట్ కోసం కనీసం రూ. 10వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి విన్నవించారు. బిసి విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థుల పూర్తి ఫీజులను చెల్లిస్తామని హామీ ఇచ్చిందని కానీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచిన హామీలు అమలు కాలేదని అన్నారు. ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిల కారణంగా విద్యార్థుల చదువులు కొనసాగించలేని పరిస్థితి నెలకొనడం బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో ఫీజు రియంబర్స్మెంట్ నిధులు కేటాయించకపోతే బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి అసెంబ్లీని ముట్టడించడం జరుగుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా ఫీజు రెయిన్బర్స్మెంట్ మెంట్ పథకాన్ని రద్దు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని అదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా బిసి ఉద్యమం ఉధృతం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు బొనగాని రవీందర్, మోర్తాల రాంరాజ్, జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, మండల కార్యదర్శి నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, పట్టణ కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, శీరంశెట్టి రాజేందర్ పెరక బిసి సంక్షేమ సంఘం నాయకులు గుంటుక రాజ్‌కుమార్, కందికొండ సురేష్, తడిగొప్పుల ప్రవీణ్, బోళ్ల రవీందర్, కొప్పుల శేషు, ఆకుల కిషోర్, రమేష్,, శ్రీనివాస్, శేఖర్ బిక్షపతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐ వారి సౌజన్యంతో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**ప్రజాపక్షం/వేలేరు :** ఎస్‌బిఐ వేలేరు వారి సౌజన్యంతో వేలేరు మండలకేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సత్తయ్య అధ్యక్షతన కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి కింద 06వ తరగతి నుండి 09వతరగతి చదువుతున్న క్లాస్ టాపర్స్ బాలికలకు వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి ఆధ్వర్యంలో వేలేరు ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి సైకిల్‌లు, ఇతర వస్తువులతో కూడిన కిట్‌ను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ 480 పాఠశాలల నుండి 10 పాఠశాలలు ఎంపిక చేయగా అందులో మన వేలేరు జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలను ఎంపిక చేసిన మన మేనేజర్ కుమారస్వామి కృషి అభినందనీయమని కొనియాడుతూ మనపాఠశాల విద్యార్థులు చదువులో, ఆటలలో రాణిస్తే ఇలాంటి ప్రోత్సాహకాలు రావడమే కాకుండా మన పాఠశాల గౌరవ మర్యాదలు పెరుగడమేకాకుండా పాఠశాల అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థినీ ,విద్యార్థులు పాల్గొన్నారు.

# సిసి రోడ్ లేకపాయే..బురదతో తిప్పలాయే.!

### వర్షం వస్తే ఇంటికి బురదతోనే దర్శనం..



**ప్రజాపక్షం/ నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రంలో బీసీ కాలనీకి మెయిన్ సైడ్ కాల్వ లేక వర్షం వస్తే వరదలతో కాలనీవాసులు నానా అవస్థలు, తిప్పలు పడుతున్నారు. మెయిన్ సైడ్ కాల్వ లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లల్లోకి వచ్చే పరిస్థితి ఏర్పడిందని మెయిన్ సైడ్ కాల్వ కట్టి ఉంటే మాకు ఇంత కష్టం వచ్చేదే కాదని కాలనీ వాసులు వాపోతున్నారు.వర్షం వస్తే అ బురద నుండి ఇంటికి,బయటికి వెళ్లాల్సి వస్తోంది కావున బురదమయంగా దర్శనమిస్తున్న మా కాలనీకి సిసి రోడ్డు వేయాలని బీసీ కాలనీ పై చిన్న చూపు, నిర్లక్ష్యం చేయొద్దని ఇంత వరకు మెయిన్ సైడ్ కాల్వ నిర్మించకపోవడం పట్ల కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సైడ్ కాల్వను,బురదమయంగా ఉన్న మా కాలనీకి,అర్హులమైన మాకు ఈ వర్షాకాలం రాకముందే సిసి రోడ్డు తక్షణమే వేసేలా చొరవ చూపలని గ్రామ సర్పంచ్,పాలక మండలిని కాలనీవాసులు కోరుతున్నారు.

# 5వ రోజుకు చేరిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**వరంగల్ నగరంలోని శ్రీ వేణు గోపాలస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు ఉదయం భువరాహ ఇష్టి కార్యక్రమం జరిగింది. అలాగే మధ్యాహ్నం సదస్యం వరంగల్ పట్టణంలోని ప్రముఖ వేద పండితులు ఘనపాటిలు వచ్చారు. తయ్యాల రాఘవాచార్యులు షణ్ముఖ శర్మ, విజయకుమారచార్యులు మట్టపెల్లి హరిప్రసాద్ శర్మ, దేవాలయ అర్చకులు ఆరుట్ల గోపాలచార్యులు మహిళా భక్త బృందం దేవస్థాన పాలక మండలి సభ్యులు మంగళవారం మధ్యాహ్నం 1వెయ్యి మందికి పైగా భక్తులకు మహా అన్నప్రసాద వితరణ జరిపారు. దాతలుగా చకిలం వెంకటేశ్వర్లు, కల్వ రాజ్ కుమార్, నగుబోతు రమేష్‌లు ఉన్నారు. దేవాలయానికి రైస్ మిల్లర్స్ వరంగల్ జిల్లా అధ్యక్షులు గోనెల రవీందర్ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి కోటేశ్వరరావు, అలాగే రైస్ మిల్లర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు తోట సంపత్ కుమార్, రైస్ మిల్లర్స్ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 4గంటలకు శతగళ విష్ణు సహస్రనామ పారాయణం సుధాకర్ టీము, సుందర సత్సంగ్ వరంగల్ భక్త బృందం మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో సుమారు 150 మంది పాల్గొన్నారు. రథోత్సవ కార్యక్రమం సాయంత్రం పురవీధుల గుండా స్వామివారి రథం కొత్తవాడ, అలాగే రేపు ఉద యం పూర్ణాహుతి, శ్రీ చక్ర స్నానము, శ్రీ పుష్పయాగం జ రుగునని దేవాలయ అధ్యక్షులు ఇరుకుల్ల రమేష్ తెలిపారు.

## ఇన్‌చార్జి సబ్ రిజిస్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మునీందర్

**ప్రజాపక్షం/ములుగు :** ములుగు ఇన్‌చార్జి సబ్ రిజిస్టర్‌గా ఖమ్మం రిజిస్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన దాసరి మునీందర్ డిప్యూటేషన్‌పై రిజిస్ట్రేషన్ స్టాంప్స్ కమిషనర్ హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు ఇటీవల ఆన్ డ్యూటీ మీద సబ్ రిజిస్ట్రర్ దిలీప్ చంద్ర గోపాల్ స్థానంలో బాధ్యతలు స్వీకరించారు. దిలీప్ చంద్ర గోపాల్ కరీంనగర్ డిఐజి కార్యాలయానికి వెళ్ళారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి పూల బొకేను అందించారు. ములుగు జిల్లా సబ్ రిజిస్టర్‌గా మంచి పేరు తెచ్చుకునే విధంగా పని చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని మునిందన్ అన్నారు. వినియోగదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని సకాలంలో అన్ని రకాల ధృవీకరణ పత్రాలు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆఫీసు సిబ్బంది స్రవంతి, రాజేష్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహ ప్రవేశంలో పాల్గొన్న టిపిసిసి సొంటిరెడ్డి

**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ పట్టణంలో జరిగిన గృహ ప్రవేశం కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు అనేది కేవలం గోడలు, పైకప్పు కాదని ఒక కుటుంబానికి గౌరవం, భద్రత, భవిష్యత్తుకు బాట అని ఆయన అన్నారు. ఒకప్పుడు నిరుపేద కుటుంబాలు చిన్న గుడిసెలో వర్షం పడితే చిందులు లెక్కబెట్టిన ఒక కుటుంబం ఈ రోజు ఇందిరమ్మ పథకం ద్వారా అలాంటి నిరుపేద కుటుంబాలు స్వంత ఇంటి కింద సంతోషంగా జీవిస్తున్నాయన్నారు. పిల్లలు చదువుకుంటూ, పెద్దలు గౌరవంగా జీవించే ఆ ఇంటి గోడలు వారి కష్టాల కథలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చింది ఇల్లు మాత్రమే కాదని..ఆశ కూడా ఇచ్చిందని సొంటిరెడ్డి చెప్పిన మాటలు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి మనసును తాకాయి. గృహ ప్రవేశం కేవలం ఒక ఇంటి ప్రారంభం. కాదు..ఒక కుటుంబం కొత్త జీవితానికి పెట్టిన మొదటి అడుగు అని ఆయన అన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/మహబూబాబాద్:**రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, వాహనాలు నడిపేవారు అతివేగంతో ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని మహబూబాబాద్ జిల్లా ఎస్‌పి డా.శబరీష్ సూచించారు. మంగళవారం స్థానిక పిఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన అరైవ్, అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా బయటకు రావద్దని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. అలాగే యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, చెడు మార్గాలవైపుకు పోకుండా వినోదాన్ని అందించే క్రీడలు, వ్యాయామం, సేవా కార్యక్రమాల్లో పాల్గొని వారి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే పోలీసుల లక్ష్యమని తెలిపారు. అనంతరం రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్, పలువురు డీఎస్పీలు, సీఐలు, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండ తండాలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని నెక్కొండ తండా గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈజిఎస్ నిధుల ద్వారా రూ.5లక్షల వ్యయంతో బానోత్ దాని ఇంటి నుండి బోడ లక్పతి ఇంటి వరకు రోడ్డు నిర్మానం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సంపేట నియోజకవర్గ టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డిలు హాజరై పనులను ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి మౌళిక వసతులు కీలకమని, ఈ రహదారి స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్, నెక్కొండ పిఏసిఎస్ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ బానోత్ రవికుమార్, ఉప సర్పంచ్ లక్పతి, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

### ఎంపిడిఒ ఎల్. భాస్కర్

**ప్రజాపక్షం/గణపురం :** ఎస్‌సి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని గణపురం ఎంపిడిఒ ఎం.భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి కల్పన కోసం రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 17 నుంచి 23వ తేదీ లోగా https://tgobmms.cgg.gov.in దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వార్షికాదాయం రూ.లక్ష 50 వేలకు మించవద్దని తెలిపారు. ఆధార్, రేషన్, కులము, ఆదయ ధ్రువీకరణతో మీసేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## గూడూరు వసతి గృహాలను తనిఖీ



**ప్రజాపక్షం/గూడూరు :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కేంద్రం లోని గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు)ను గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోత్ దేశీరామ్ నాయక్ మంగళవారం తనిఖీ చేసి విద్యార్థులతో యకలిసి భోజనం చేసి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కామన్ డైట్ మెనూ పక్కాగా అమలు చేయాలని అన్నారు. విద్యార్థుల హాజరు శాతం 100 శాతం ఉండే విధంగా ఉపాధ్యాయులు చూసుకోవాలని అన్నారు. నూతన టెక్నాలజీ వినియోగించి ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. పిల్లలకు వైద్య పరీక్షలు ప్రతి నెల చేయించాలని వారు సూచించారు. హెల్త్ ఎడ్యుకేషన్ సానిటేషన్ కల్పిచాలని అన్నారు. మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 100 శాతం పాస్ కావాలని అన్నారు.

## అప్పయ్యపల్లిలో.. వైద్య శిబిరం



**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండలంలోని అప్పయ్య పల్లి గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఎలుక పెల్లి రమేష్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రాణాలికలో భాగంగా గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని కోరారు. డాక్టర్ నిహారిక ఆధ్వర్యంలో బిపి, షుగర్, కంటి, దంత జనరల్ పరీక్షలు నిర్వహించి మందులు అందించి జాగ్రత్తలు తీసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం వినోద,వేణు,ఆశ వర్కర్ పద్మ, కారోబార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

### మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మైల జయరామ్ రెడ్డి సూచనల మేరకు మంగళవారం మంగపేట మండలం దొమేడ గ్రామంలోని ముస్లిం సోదరులు మసీద్ చుట్టూ ప్రహరీ గోడ కావాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకి తెలియజేశారు. వెంటనే మంత్రి సీతక్క స్పందించి 6 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్ మంజూరు చేయగా మంగళవారం నిర్మాణ పనులను ముస్లిం మత పెద్దలు మొల్ సాహెబ్ కాంగ్రెస్ పార్టీ నాయకులచే ప్రారంభించారు అనంతరం మంత్రి సీతక్క చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన ముస్లిం సోదరీమణులు, అదే విధంగా రంజాన్ పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు ఇది చాలా పవిత్రమైన నెలగా వారు భావిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంచే ముస్లిం కుటుంబాలకు తోఫా కిట్లను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పంపగా కాంగ్రెస్ పార్టీ నాయకులచే ముస్లిం కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యాణయ్య, సొసైటీ మాజీ చైర్మన్ తోట రమేష్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్ర బాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమరం బాలన్న, మాజీ ఎంపీటీసీ కొమరం సారయ్య, గ్రామ అధ్యక్షులు సప్పిడి వెంకటేశ్వర్లు, పల్నాటి సంతోష్, మహ్మద్, ఆశీ, కొమరం కన్నయ్య పాల్గొన్నారు.

## ప్రైవేట్ హాస్పిటల్‌లో జిల్లా వైద్యాధికారి తనిఖీ



**ప్రజాపక్షం/తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని విజయలక్ష్మి హాస్పిటల్‌లో ఓ మహిళ జ్వరంతో చికిత్స కోసం ఆసుపత్రికి రాగా డాక్టర్ కిరణ్‌కుమార్ మహిళతో అనుచితంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు ఆరోపించిన ఘటనలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాథోడ్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని విజయలక్ష్మి హాస్పిటల్‌పై ఉన్న ఆరోపణలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవిరాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఆసుపత్రికి చెందిన వైద్యుడు డాక్టర్ కిరణ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ భాగంగా ఈ తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీ సమయంలో ఆసుపత్రి మూసివేసి ఉండటం గమనార్హం. దీనిపై సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ ఆసుపత్రుల నిర్వహణలో నిర్లక్ష్యం, నియమ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతీ ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది బాధ్యత అని చెప్పారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### బిజెపి జిల్లా కార్యదర్శి లింగంపెల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/మంగపేట :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి లింగంపెల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. మంగళవారం మండల కేంద్రంలో మీడియాతో శ్రీనివాసరావు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా విద్యార్థులకు యువ వికాసం నిరుపేదలకు ఇంటి స్థలం 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం రైతులకు 2 లక్షల రుణమాఫీ, గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు 4500 పెన్షన్, కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి లింగంపెల్లి శ్రీనివాసరావు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రక్తదానం..మహాదానం



**ప్రజాపక్షం/తొర్రూరు :** రక్తదానం మహాదానమని రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషన్‌రావు, ఎంజేపీ బీసీ బాలుర గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. మండలంలోని నాంచారిమదూరు గ్రామంలో ఎంజేపీ బీసీ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) శిబిరంలో భాగంగా ఆరవ రోజు సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. రక్తదానం చేయడం వలన వారి ప్రాణాలను నిలబెట్టిన వారమవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గిరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రేవ్యానాయక్, కళాశాల హెల్త్ సూపర్‌వైజర్ బి.విక్టోరియా, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపికలు

**ప్రజాపక్షం/గణపురం :** భావి భారత క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా పాఠశాలల ప్రవేశాల ప్రక్రియ మంగళవారం గణపురంలో ప్రారంభమైంది. 4వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులకు ప్రాథమిక స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి మహ్మద్ అఫ్రోజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అద్భుతమైన క్రీడా నైపుణ్యం ఉంటుందని, దానిని సానబెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంపికల్లో భాగంగా విద్యార్థులకు 800 మీటర్ల పరుగు, షటిల్ రన్, వర్టికల్ జంప్ వంటి శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దేసు సతీష్ కుమార్, సరిత, పీఈటీలు సాంబరాజు, గఫూర్ పాల్గొన్నారు.

## ప్రజా బాట కార్యక్రమం నిర్వహణ



**ప్రజాపక్షం/కన్నాయిగూడెం :** కన్నాయిగూడెం పట్టణానికి సంబంధించిన కొత్త 11కేవీ బ్రేకర్‌ను 33/11.కేవీ కన్నాయిగూడెం సబ్‌స్టేషన్‌లో ఎస్ఈ ములుగు, డిఈ ఏటూరునాగారం, ఎడిఈ ఎఈ. స్వామి కన్నాయిగూడెంల సమక్షంలో విజయవంతం చేయడం జరిగింది. ప్రజా బాట కార్యక్రమాన్ని లక్ష్మీపుర. గంగుగూడెం. సర్వాయి. గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళి క్రింద అదనంగా మూడు 25 కెవిఎ సామర్థంతో 1ఫేజ్ డీటీఆర్‌లను ఏర్పాటు చేయబడినవి. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్వాయి రాజు సర్పంచ్, ఉప సర్పంచ్ మోహన్. వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్‌గా సూర్యప్రకాష్



**ప్రజాపక్షం/నర్సింహులపేట :** భారతీయ జనత పార్టీ తెలంగాణ రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్‌గా మహబుబాబాద్ జిల్లాలోని నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన అన్నవజ్జుల సూర్యప్రకాష్ రెండవసారి ఎంపిక య్యారు. పార్టీకి చేసిన ఎనలేని సేవలను గుర్తించిన హైకమాండ్ రెండవ సారి ఆయనను రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్‌గా నియమించారు. ఆయనతో పాటు కో కన్వీనర్‌గా నిరంజన్ దేశాయ్‌ను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర భారతీయ జనత పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావును కలిసి పుష్పగుచ్చం అందించారు. రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్‌గా రెండవ సారి ఎన్నిక కావడం పట్ల పార్టీ శ్రేణులతో పాటు, స్వగ్రామంలోని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అన్నవజ్జుల సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. తన ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ రాష్ట్రవ్యాప్త దేవాలయాల భూముల పరిరక్షణతో పాటు అక్రమణల నివారణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## గ్రాడ్యుయేషన్ డే ఓపెన్ హౌస్ కార్యక్రమం




**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండల కేంద్రంలోని ఫ్రోబెల్ మోడల్ హైస్కూల్‌లో ప్రీప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే మరియు ఓపెన్ హౌస్ కార్యక్రమంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా, ప్రీ ప్రైమరీ పూర్తి చేసిన చిన్నారులకు పాఠశాల సర్టిఫికెట్లు అందించారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ క్యాప్‌లు ధరించి, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు చేసి తల్లిదండ్రులను ఆహ్లాదపరిచారు. ఓపెన్ హౌస్‌లో తల్లిదండ్రులు బోధనా విధానాలు, వాతావరణం, పిల్లల అభివృద్ధి గురించి సమగ్రంగా తెలుసుకున్నారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించగా, ప్రిన్సిపాల్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ డే విద్యార్థుల జీవితంలో కొత్త ఆరంభం అని, తల్లిదండ్రులు పిల్లలను మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంచి, గిజుబోయి పద్ధతిలో ప్రత్యేక శ్రద్ధతో బోధన అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పబ్బ శివ శంకర్ గౌడ్, డైరెక్టర్లు యాదగిరి గౌడ్,జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల పరిధిలోని ఆరేపల్లి లో ఇందిరమ్మ ఇల్లును కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తో కలిసి స్థానిక సర్పంచ్ రజిత రాజశేఖర్ ప్రారంభించారు. ఆరేపల్లి కి ప్రభుత్వం ఆరు ఇండ్లు మంజూరు చేయగా యాస్మిన్ బేగం చెందిన ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో మంగళవారం ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రెండవ విడతలో అర్హులైన వారికి మరిన్ని ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేష్మ సలీం, నాయకులు శ్రీకాంత్ రెడ్డి తో పాటు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల నిరసనకు సర్పంచ్ సంఘీభావం




**ప్రజాపక్షం / కొండాపూర్ :** కొండాపూర్ మండలం మల్లేపల్లి శివారులో గల శాన్విటా బయోటెక్నాలజీస్ పరిశ్రమ వద్ద ఉద్యోగులు చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమానికి గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఆయన సంస్థ ఎండి శ్రీ విశ్వరూప్‌తో ఫోన్‌లో మాట్లాడి కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాని కోరారు. ఈ సందర్భంగా కార్మికులు తమ ఆవేధన వ్యక్తం చేస్తూ గత తొమ్మిది నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కుటుంబాల కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితి ఏర్పడడంతో అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామని ఆవేధన వ్యక్తం చేశారు. సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల అధైర్యపడవద్దని సూచిస్తూ వారి తరపున యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## గ్రామ పంచాయతీ సిబ్బంది ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** చలో హైదరాబాద్ ధర్నాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న గ్రామపంచాయతీ సిబ్బందినీ మంగళవారం నిజాంపేట పోలీసుల ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ ధర్నాకు వెళ్లేందుకు సిబ్బంది సమీకరిస్తుండగా, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై గ్రామపంచాయతీ సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బత్తుల రాములు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులుగా రోడ్డుపై జనరేటర్

### పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
### తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహన దారులు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో నడిరోడ్డుపై జనరేటర్ పెట్టి నిరాటకంగా వ్యాపారం సాగిస్తున్న పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఆదారిన గుండ వచ్చే బాటసారులు, వాహన చోదకులు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సామాన్య ప్రజలు రోడ్డు నిబంధనలు కాస్త ఉల్లఘించిన ఫోటోలు తీసి జరిమాన విధించే ట్రాపిక్‌పోలీసులకు గత మూడు రోజులుగా రోడ్డు జనరేటర్ ఉన్నప్పటికి ఎందుకు పట్టించుకోవటం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఆర్టీఓ కార్యాలయానికి కూటవేటు దూరంలోనే రోడ్డు మధ్యలో జనరేటర్‌ను ఉంచటం వల్ల ఆదారి గుండ వచ్చే వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత కొంత కాలం క్రితం పోలీసు కమిషనర్‌గా విజయకుమార్ విధులు నిర్వహించిన క్రమంలో ట్రాపిక్ సమస్యపై పలు సంస్కరణలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని రద్దీ రోడ్డుగా ఉన్న సుభాష్ రోడ్డును పూర్తిగా క్రమబద్దీకరించారు. ఎక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించిన తక్షణ చర్యలు చేపట్టడంతోపాటు ట్రాపిక్ సమస్యను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.




ట్రాపిక్ పోలీసు అధికారులు సైతం వాహనాల్లో నిరంతరం పర్యటిస్తూ పర్యావేక్షించేవారు. సిపి బదిలీపై వెళ్లినప్పటి నుండి పట్టణ ట్రాఫిక్ వ్యవస్థ మళ్లీ గాడి తప్పింది. రోడ్లపై రోజుల తరబడి ఉంచిన ట్రాఫిక్ పోలీసు అధికారులు పట్టించుకోకపోవటంపై పోలీసు పనితరు పలు అనుమానాలకు తావిస్తుంది. రోడ్డు పై జనరేటర్ ఉంచటం రెండు వాహనాలు సైతం ఎదురేదురుగా వెళ్లలేని పరిస్థితి ఏర్పాడ్డాయి. ఇప్పటికైన ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పందించి రోడ్డుపై ఉంచిన జనరేటర్‌ను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

### మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** పవిత్ర రంజన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే మైనార్టీ సోదరుల కోసం కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతిక అని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మంజీరా గార్డెన్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన మైనార్టీ సహోదరుల కు ఫల హారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒకటేనని , మనషులంతా సహోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అద్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, జిల్లా మైనార్టీ నాయకులు ఖలీం, మాజీ కోప్షన్ సభ్యులు గౌస్,ఉప సర్పంచ్ సద్దాం హుసేన్, వార్డు సభ్యులు, మైనార్టీ సహోదరులు, ఖుర్షీద్, చోటు, సూఫీ, అప్సర్, ఇబ్రాహీం, షాహిద్ పాషా, తోపాటు నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

### మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజు



**ప్రజాఫక్షం / పటాన్‌చెరు :** పటాన్చెరు నియోజకవర్గ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలికి మర్యాదపూర్వక సన్మానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .మార్కెట్ కమిఈ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివానందం ,వైస్ చైర్మన్ రాజశేఖర్ ,డైరెక్టర్‌లు హమీద్ సందిప్‌లను మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజు , చిన్న ముదిరాజ్ సందీప్ లు మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బాలరాజు మాట్లాడుతూ నూతన పాలక మండలి ఆద్వర్యంలో మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా రైతులకు మార్కెట్ యార్డులో ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. మార్కెట్ కార్యాకలపాల్లో పారదర్శకతను పాటిస్తూ రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు ,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** బిజెపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మెదక్ జిల్లా నిజాంపేట మండల శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావడానికి మేనిఫస్టోలో ఏర్పాటు చేసిన 6 గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని నిజాంపేట మండల తహసీల్దారు కార్యాలయం ముందు బిజెపి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిమానమైన శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం కింద 2500 రూ.లు, వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు పెన్షన్ల పెంపకం, చదువుకునే యువతులకు స్కూటీలు పంపిణీ, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం వంటి పథకాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని, పంటలు పొట్టదశకు చేరుకున్న ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో



ఆందోళన కార్యక్రమంలో నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట గ్రామ సర్పంచ్ చలిమేటి నరేందర్, ఉప సర్పంచ్ గిరిగంటి బాబు, బీజేవైఎం మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం ప్రశాంత్ గౌడ్, బిజెపి మండల నాయకులు రేవుల కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత పూజలో పాల్గొన్న మాజీ మంత్రి దయాకర్‌రావు



**ప్రజాపక్షం/తొర్రూరు :** రైతులు, అన్ని వర్గాల ప్రజలను చల్లగా చూడు దుర్గమ్మ తల్లి అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని జమస్తాన్‌పురం గ్రామంలో దుర్గామాత పండుగను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ పూజ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి దయాకర్‌రావు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, ప్రమోద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

## రామతీర్థంలో ఎల్లమ్మ పండుగ

### హాజరైన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థంలో మంగళవారం రోజు మాజీ సర్పంచ్ అనూరాధ బాబా గౌడ్ ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ కల్యాణం కనుల పండుగగా జరిగింది. అనంతరం ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి కల్యాణం చేపట్టగా జోగిని రాధిక బోనం ఎత్తుకున్నారు. డప్పు చప్పుళ్లతో,యువకుల నృత్యాలతో, పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట సీనియర్ నాయకులు గ డ్డీల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు తిమ్మయ్యగారి గురుమూర్తి గౌడ్ జగన్, లింగారెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, బాల గౌడ్, స్థానిక సర్పంచ్ సాయి రెడ్డి, నాయకులు అనిల్ రెడ్డి, మల్లేశం, దుర్గయ్య, రాము గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి లయన్స్ క్లబ్ తోడ్పాటు



**ప్రజాఫక్షం / కొండాపూర్ :** కొండాపూర్ మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయిన్స్ క్లబ్ సంగారెడ్డి ఆద్వర్యంలో విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటుగా పాఠశాలకు రూ. 12 వేల విలువైన గ్రంథాలయ పుస్తకాలను భద్రపరిచే బీరువాను , తెలంగాణ తెలుగు కవులు, సాహితీవేత్తల చిత్రపటాలను బహుకరించారు.. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సంగారెడ్డి అద్యక్షులు పర్యాద రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ తన సొంత గ్రామానికి సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం లయిన్స్ క్లబ్ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామసర్పంచ్ గడీల శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ లయిన్స్ క్లబ్ చేస్తున్నసేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, క్లబ్ సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయిన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పి.రాములుగౌడ్, విజయేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీదర్‌రెడ్డి, ప్రకాష్ వీరారెడ్డి, పాండురంగారెడ్డి, రామాగౌడ్ ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో ఆరోగ్య మిత్ర మృతి

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ఆరోగ్యశ్రీ విభాగంలో ఆరోగ్యమిత్రగా గత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న పాపన్నపేట గ్రామానికి చెందిన కుకునూరు సంజీవరెడ్డి సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్య మిత్రగా గత కొంతకాలం టేంతకాలం , రామయంపేట పి.హెచ్. సి లో ప్రస్తుతం మెదక్ ఆర్తో హాస్పిటల్ ఆరోగ్యమిత్రగా పని చేస్తూ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఆయన స్వగ్రామమైన పాపన్నపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. వీరి కుటుంబ సభ్యులను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ వారు ఆదుకోవాలని ఆ యూనియన్ నాయకులు కోరారు

# 14 ఏళ్ల పిల్లలకు హెచ్‌పివి వ్యాక్సిన్

**ప్రజాపక్షం/రామాయంపేట :** పిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ మంగళవారం అధికారులు హెచ్‌పివి వ్యాక్సిన్ వేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొని చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్ దోహదపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ లింబాద్రి, మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్మెన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, పుట్టి సందీప్, బైరం స్వప్న, దేవుని రంజిత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో దుడ్డె మృతి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో రోజురోజుకు కుక్కల బెడత తీవ్రత పెరిగిపోతుంది. గ్రామంలో గుంపులుగా సంచరిస్తూ దుడ్డే పై దాడి చేసి చంపేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అలాగే గ్రామంలో కేశల సిద్ధరాములు ను కుక్కలు కరవడం చిన్నపిల్లలు ఒంటరిగా వెళ్లిన వారిపై దాడి చేస్తున్నాయని తెలిపారు.

# ముస్లిం పోలీసు సిబ్బందికి ఇఫ్తార్ విందు

**ప్రజాపక్షం / సంగారెడ్డి :** జిల్లా పోలీసు ముస్లిం సిబ్బందికి జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముస్లిం పవిత్ర మాసం రంజాన్ పవిత్రమాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్దలతోనిష్టగా ఉపవాస దీక్ష చేస్తారని ఇస్లామిక్ క్యాలెండర్‌లో తొమ్మిదవ నెల అయిన పవిత్ర రంజాన్ మాసంలో రోజువారి ఉపవాసాన్ని ముగించడానికి సూర్యాస్తమయం తరువాత మగ్రిబ్ పార్థన అనంతరం తీసుకునే పండ్లు, ఫలహారం భోజనమే ఇఫ్తార్ అని తెలిపారు. ఈ విందులో జిల్లా పోలీసు అధికారులతో పాటు ముస్లిం సిబ్బంది అదిక సంఖ్యలో పాల్గొని ఉపవాస దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, డిఎస్పీ సత్తయ్య గౌడ్ ,ప్రభాకర్ సురేందర్ రెడ్డి, ఎంఆర్ డిఎస్పీ నరేందర్ ఇన్స్‌క్టర్ రమేష్, రాము నాయుడు, రామకృష్ణ, రెడ్డి క్రాంతి కుమార్, ఆర్‌ఐలు రాజశేఖర్, రెడ్డి ,డానియల్ ,శ్రీనివాస్ రావు, ముస్లిం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ హెల్త్ కార్డుల అమలుకు సమగ్ర యాక్షన్ ప్లాన్

## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**ప్రజాపక్షం / సంగారెడ్డి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న డిజిటల్ హెల్త్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడానికి డిజిటల్ హెల్త్ కార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు జిల్లా వైద్య అధికారులతో డిజిటల్ హెల్త్ కార్డు ప్రక్రియ సమర్థవంతంగా ఏలా అమలు చేయాలనే అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యమాట్లాడుతూ ప్రజలకు వేగవంతమైన ,పారదర్శకమైన ఆరోగ్య సేవలు అందించడంలో డిజిటల్ హెల్త్ కార్డులు కీలక పాత్ర షోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి హెల్త్ ఐడి నమోదు జరిగేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రాజెక్టు అమలుపై అవగాహన అవరసమైన సిబ్బంది పరికరాలు ప్రాథమిక నివేదిక ను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని వైద్యాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నమోదు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు తగిన సిబ్బంది నియామకం సాంకేతిక లోపాలు ,తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ఓపి కేంద్రాలు సిద్ధం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం వసంతరావు, వైద్యాధికారులు, డాక్టర్ శశాంక్ డాక్టర్ నాగ నిర్మల సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి




**ప్రజాపక్షం/రామాయంపేట :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం అద్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై ముస్లిం సోదరులతో కలిసి మజీద్‌లో ఉపవాస దీక్ష విరమణ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అన్ని మతాల ప్రజలు కలిసికట్టుగా జీవించాలనే సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఇఫ్తార్ విందులో ముస్లిం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు ప్రభుత్వం తరుపున ఇఫ్తార్ తోఫాను అందించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, పుట్టి సందీప్, దేవుని రంజిత్, తహసీల్దార్ రజనికుమారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్కుల మహిపాల్‌రెడ్డి, సరాపు యాదగిరి, రమేష్‌రెడ్డి, రంగ రాజాకిషన్, ఆర్‌ఐలు గౌస్, గోపీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పర్వదిన ఆహ్వాన పత్రికావిష్కరణ

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం / పటాన్‌చెరు :** తెలుగు ప్రజల నూతన సంవత్సర ఆరంభం తొలి పండుగ ఉగాది పర్వదినం పురస్కరించుకొని మార్చి 19వ తేదీన పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయంలో ఉగాది పర్వదిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఉగాది పర్వదినం సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయంలో గ్రామ పుర ప్రముఖుల సమక్షంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 6 గంటలకు హనుమాన్ దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకం, కుంకుమ సిందూర అర్చనం నూతన వస్త్రాలంకరణ వేడుకలు నిర్వహించడంతో పాటు సాయంత్రం ఐదు గంటలకు శ్రీపరాభవ నామ సంవత్సర పంచాంగ పట్టణం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలందరూ భారీ సంఖ్యలో హాజరై పర్వదిన వేడుకలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు బాయికాడి విజయ్ కుమార్, సభ్యులు వంగారి అశోక్, చంద్రశేఖర్, గోలి మల్లేష్ యాదవ్ గుండమల్ల రాజు ,రమేష్ ,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రోటోకాల్ పాటించరా?

## అధికారుల తీరుపై బిజెపి నాయకుల ఫైర్




**ప్రజాపక్షం/రామాయంపేట :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ప్రదాని, ఎంపీ ఫోటో లేకుండా చేసి అధికారులు ఫోటోక్రాల్‌ను ఉల్లంఘించారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు ఆరోపించారు. సిహెచ్‌సి సెంటర్‌లో మంగళవారం వేసిన వ్యాక్సిన్ కార్యక్రమంలో కూడా ప్రదాన మంత్రి, ఎంపీల ఫోటోలు లేకుండానే కార్యక్రమం కొనసాగిందని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అధికారులు విస్మరించడం తగదన్నారు. గతంలో కూడా ఫోటో క్రాల్ విషయమై జిల్లా కలెక్టర్క్ పిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికార యంత్రంగానికి గతంలో అనేక సార్లు పిర్యాదు చేసినప్పటికి కనీసం అవగాహన లేకుండా వ్యవహరించడాన్ని బీజేపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కలెక్టర్ కార్యాలయం ముందు దర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పట్టణ అద్యక్షులు శీలం అవినాష్‌రెడ్డి, అక్కన్నపేట సర్పంచు బక్కయ్యగారి యాదగిరితో పాటు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో బేటీ జన్మోత్సవ కార్యక్రమం

**ప్రజాఫక్షం / సంగారెడ్డి :** సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో మహిళా ,శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో మహిళా సాదికారత కేంద్రం సహకారంతో బేటి జన్మోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్బంగా ఆసుపత్రిలో పుట్టిన ఆడ శిశువులను గౌరవిస్తూ బేటీ జన్మోత్సవ కిట్లు ,ప్రశంసాపత్రాలు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిడబ్ల్యూ ,డీఎంహెఛ్ఓ మాట్లాడుతూ ఆడపిల్లలు, మగపిల్లలను సమానంగ చూడాల్సిన అవసరాన్ని వివరించారు. సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెంపోడించాల్సిన అవసరాన్ని బాలికల విద్య, ఆరోగ్యం ,భద్రతకు ప్రతి ఒక్కరూ బాద్యత వహించాలని సూచించారు. అలాగే పుట్టిన శిశువులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలనే ఇవ్వాలని అవగాహన కల్పించారు. అదనంగా అవసరమైన సందర్బాల్లో మహిళా సాదికారత కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బాలికల హక్కుల పరిరక్షణ పోషణ, విద్యపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవడం ద్వార సమాజం అభివృద్ధి సాద్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ నాగనిర్మల , మహిళా సాదికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, ఆసుపత్రి సిబ్బంది ,ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడింది. అదే విధంగా పటాన్చెరు ఏరియా ఆసుపత్రిలో ఈ కిట్స్ అందించడం జరిగింది.

# ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

## మండల వ్యవసాయ అధికారి శ్వేత

**ప్రజాపక్షం/కొల్చారం :** ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మంచి దిగుబడితోపాటు అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి శ్వేత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి, రంగంపేట,రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మండలంలో నాలుగు క్లస్టర్లను సెలెక్ట్ చేయడం జరిగింది అని ఏవో తెలిపారు. కొల్చారం, అంసాన్‌పల్లి, పోతంశెట్టిపల్లి, ఎనగండ్ల, ఒక్కో క్లస్టర్ లో 125 మంది రైతులను సెలెక్ట్ చేసి వాళ్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం కిట్లు, సాయిల్ హెల్త్ కార్డులు ఇవ్వడం జరిగింది అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత క్లస్టర్ మండల ఏఈఓలు అంబిక, నిరోషా, పోతంశెట్టిపల్లి సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, చంద్రశేఖర్ రెడ్డి, రూప్లా నాయక్, యాదుల్, రమేష్, పెంటయ్య, సంగమేశ్వరప్ప, శ్రీనివాస్ గౌడ్, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం / హత్నూర :** హత్నూర మండలం సిరిపురం గ్రామంలో మంగళ వారం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ,మేడ్వాన్ ఆద్వర్యంలో ఉచిత శిభిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో మహిళలకు రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. అదే విధంగా వైద్య పరిక్షలు మామే గ్రాఫీ అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేశారు. రొమ్ము కేన్సర్ సూచనలు కనిపించిన వారికి సలహాలు ఇచ్చినట్లు వారు తెలిపారు. దేశంలో రొమ్ము కేన్సర్ సమస్య ఎక్కువగా ఉండి తక్కువ అవగాహనతో ఆలస్యంగా గుర్తించి రొమ్ము కేన్సర్ భారిన పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కేన్సర్ రావడానికి నియంత్రణ ఒక్కటే మార్గమన్నారు. దీన్ని ముందుగా గుర్తించకుంటే కాన్సర్ వ్యాప్తి చెంది మహిళలు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు .వైరస్ దశల వారీగా ప్రమాద కణాలు చిన్న వయస్సు కుటుంబంలో ఎవరికైనా ఉంటే ప్రసవ అనంతరం ఆరు ముండ్లు మార్పు అధిక ప్రమాద కాలం 30 ఏళ్లపై బడి 50 సంవత్సరాల తరువాత వయస్సు పెరుగుతున్న కొద్ది ప్రమాదం పెరుగుతుంది. జీవన శైలి అధిక బరువు, పొగ త్రాగం తక్కువ శారీకం చలనం పై కారణాల వల్ల రొమ్ము క్యాన్సర్ వాప్తి చెందుతున్నట్లు వారు అవగాహన కల్పిస్తూ అవరసమైన వారికి స్కానింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిపురం, మాజీ సర్పంచ్ , నరేందర్ డాక్టర్లు బిజేపి నాయకులు చంద్రమోహన్ రెడ్డి సార శ్రీనివాస్ గౌడ్, తెల్లరాళ్ల తండా సర్పంచ్ సేనావత్ మల్లేష్, మహిళలు పాల్గొన్నారు.